క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

నరసన్నపేట: మండలంలోని బొరిగివలసలో కలాం నంద వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. సొసైటీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 41 మంది యువకులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కలాం నంద వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు పాగోటి రాంబాబు మాట్లాడుతూ.. రక్తదానానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక యూనిట్ రక్తం ఒకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొరిగివలస గ్రామస్తులు, సొసైటీ ప్రతినిధులు గొల్లంగా ముఖలింగం, కోటిపల్లి జగదీష్, కుంచి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఆమదాలవలస: మెట్టక్కివలస కొత్త అగ్రహారం ప్రధాన వీధిలో దుర్గాదేవి విగ్రహ 42 వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలు, పలు వార్డుల ప్రజలు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి కమిటీ సభ్యులు నాగళ్ల మురళీధరరావు, గురుగుబెల్లి మురళి, చౌదాల గోవిందరావు, బలివాడ మహేష్, పేడాడ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి నివాళి



సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలంరాజు, తదితరులు

నరసన్నపేట: ఉన్నత ఆశయాలు కలిగి, పీడిత ప్రజలకు అండగా ఉంటూ.. వారి బాగోగుల కోసం పాటుపడే ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేస్తామని సీపీఐ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్.నీలంరాజు అన్నారు. మండలంలోని కోమర్తి కాలనీలో సాయిబాబా చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలంరాజు మాట్లాడుతూ సాయిబాబా మృతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. మనవ హక్కుల కోసం నిరంతరం శ్రమించిన మహా నాయకుడని అన్నారు. సాయిబాబా మరణం ప్రజాసంఘాలకు తీరని లోటన్నారు. కాలనీ వాసులు పలువురు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



తామరలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: మండలంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.1.75 కోట్లతో పలుచోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. పాతపట్నం, తామర, తీమర పంచాయతీల్లో సీసీ రహదారులు నిర్మించనున్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, ఏపీఓ సురేష్, ఆర్ఐ బాబీ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో భారీ వర్షం



వర్షంనీటితో నిండిన ఆర్టీసీ కాంప్లెక్స్

పాతపట్నం: మండల వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పాతపట్నంలో గంటన్నరపాటు వర్షం కురవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వర్షం నీటితో నిండింది. కొరసవాడ, కాగువాడ, పెద్దసీది, గంగువాడ, రొంపివలస తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో వర్షం నీరు చేరింది.

24 లోగా దరఖాస్తు చేసుకోవాలి

సరుబుజ్జిలి: ఈ నెల 24వ తేదీ లోగా మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి అర్హత కలిగినవారు తమ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని బూర్జ ఐసీడీఎస్ పీఓ గీత ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 18 ఏళ్ల వయస్సు లోపుగల తల్లిదండ్రులు లేనివారు, హెచ్ఐవీ బారినపడిన తల్లిదండ్రుల పిల్లలు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేల లోపు కలిగినవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

● ప్రమాదకరం



కొత్తూరు మండలంలోని వీరనారయణపురం రోడ్డు (మాతల-రుగడ)లో డోల గెడ్డపై నిర్మించిన కల్వర్టు కొంత భాగం కూలిపోయింది. కల్వర్టు పైనుంచి వాహనాలు వెళ్లకుండా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుకు అడ్డంగా చిన్న గోడ నిర్మించారు. కొత్తగా వచ్చిన వాహనదారులు కల్వర్టు దగ్గర తడబడుతున్నారు. కల్వర్టు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వీరనారాయణపురం, మాకవరం, కుద్దిగాం, మాతల కాలనీలతోపాటు పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - కొత్తూరు

● పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలం ముంగెన్నపాడు వంశధార కాలువ దుస్థితి. వంశధార కుడి ప్రధాన కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోయి సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. మల్లికార్జునపురం వెనకభాగంలో 16.466 కిలోమీటరు హెడ్ రెగ్యులేటర్, ముంగెన్నపాడు, బొత్తాడసింగి వంతెనల వద్ద గుర్రపుడెక్క ఎక్కువగా ఉంది. గుర్రపుడెక్కను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - ఎల్.ఎన్.పేట

● అధ్వానం



ఈ చిత్రం బూర్జ మండలంలోని మదనాపురం జంక్షన్‌లో సరుబుజ్జిలి-మదనాపురం పక్కా రహదారి దుస్థితి. రహదారిలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో రోజూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు. - బూర్జ

● చేతికి అందినంత ఎత్తులో..



పాతపట్నం మండలంలోని కొంచాడపేట గ్రామంలో రహదారి పక్కన మూడు అడుగుల ఎత్తులో విద్యుత్ ఫీజ్ బాక్సు ఉంది. ఈ బ్యాక్స్‌కు రక్షణ ఏర్పాటు చేయలేదు. దీనికి సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాల ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ఫీజు బాక్స్‌ను ఎత్తు పెంచాలని, రక్షణ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. - పాతపట్నం

నట్టల నివారణ మందుతో..
జీవాలకు రక్ష

- ఈ నెల 30 వరకు టీకా కార్యక్రమం
- పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస: అంతర్ పరాన్న జీవులు, ఏలికపాములు, జలగలు, బద్దె పురుగులు కడుపులో చేరడం వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడే అవకాశం ఉంది. సకాలంలో నట్టల నివారణ మందు (డీవార్మింగ్) ఇవ్వడం ద్వారా దీనిని నివారించవచ్చును. ఆమదాలవలస, ఎల్ఎన్‌పేట, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామ సచివాలయాల్లోని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్‌లు గొర్రెలు, మేకలకు టీకాలు అందించే విధంగా శాఖాపరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పశుపోషకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. నట్టల నివారణ కార్యక్రమం ఈ నెల 16న ప్రారంభమైంది, 30వ తేదీ వరకు కొనసాగనుంది.

నట్టల వ్యాధి లక్షణాలు..

భూమికి దగ్గరగా ఉన్న గడ్డిని తినడం వల్ల గొర్రెలలో ఉండే అంతరపరాన్న జీవుల గుడ్లు పేడ ద్వారా నేలపై చేరి లార్వాగా అభివృద్ధి చెంది గడ్డిపై చేరి ఉంటాయి. ఈ గడ్డిని గొర్రెలు, మేకలు తిన్నప్పుడు తిరిగి శరీరంలో ప్రవేశిస్తాయి. పేడను ముద్దగా వేయడం, విరేచనాలు చేసినప్పుడు అందులో బద్దెపురుగుల కనిపిస్తాయి. శరీరానికి అందే పోషక పదార్థాలను నట్టలు ఉపయోగించుకోవడం వల్ల గొర్రెలు బలహీనంగా ఉంటాయి. కొన్ని రకాల అంతరపరాన్ని జీవులు శరీరం నుంచి రక్తాన్ని పీల్చుకోవడం వల్ల రక్తహీనత కలిగి కళ్లు తెల్లగా పాలిపోయి ఉంటాయి. జలగలు కలేయంలో ఉండటం వల్ల ఆ భాగం దెబ్బ తింటుంది. దీంతో గడ్డం కింద నీరుచేరి వాపు వస్తుంది. ఈ వాపు సాయంత్రం వేళల్లో మాత్రమే కనిపిస్తుంది. జీవాలు బలహీనంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో న్యూమోనియా వంటి వ్యాధులు కూడా వ్యాపిస్తాయి.



గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశుసంవర్థకశాఖ సిబ్బంది (ఫైల్)

గొర్రెలు, మేకల వివరాలు ఇలా..

నియోజకవర్గం	గొర్రెలు, మేకలు
ఆమదాలవలస	39,500
ఎల్.ఎన్.పేట	44,500
నరసన్నపేట	42,000

నివారణ మార్గాలు..

జీవాలలో లక్షణాలు గుర్తిస్తే పేడను పరీక్ష చేయించి పశు వైద్యాధికారి సిఫార్సు చేసిన మందులను వాడాలి. చనిపోయిన గొర్రెలకు పరీక్ష చేయించి ఏదైనా వ్యాధి ఉన్నట్లు నిర్ధారిస్తే మిగిలిన మందకు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి. ఏడాదికి కనీసం నాలుగుసార్లు నట్టల నివారణ మందులు వేయాలి. ఏలికపాములు ఉంటే అల్బెండ జోల్, ఫెన్‌బెండ్ జోల్ తాగించాలి. జలగలు ఉంటే ఆక్సిక్లోజనైడ్, రఫాక్సినైడ్, క్లోజంటాల్ వాడాలి. బద్దె పురుగులు ఉంటే క్లోజమైడ్ వంటి మందులు వేయాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

జీవాల వయస్సు, బరువు మేరకు సరైన మోతాదులో మందు ఇవ్వాలి. తక్కువగా ఇస్తే పనిచేయదు. ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల గర్భంతో ఉన్న జీవాలకు అబార్షన్ అయ్యే అవకాశం ఉంటుంది. నట్టల మందు తాగించే ముందు రోజు తక్కువ మేత ఇవ్వాలి. ఉదయాన్నే జీవాలకు మేతకు తీసుకువెళ్లే ముందే మందు తాగించాలి.

పూర్తి స్థాయిలో అందించాలి



ప్రభుత్వం ద్వారా అందించే నట్టల నివారణ మందులు పూర్తి స్థాయిలో సప్లై రావడంలేదని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. తూతూ మంత్రంగా మందులు అందిస్తున్నారు. కొన్ని గ్రామాలకు మాత్రమే అందిస్తున్నారు.

– యర్ల రమణ యాదవ్, పశుపోషకుడు, చిట్టివలస, ఆమదాలవలస

టీకాలు సద్వినియోగం చేసుకోండి...



గొర్రెలు, మేకలలో నట్టల నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన టీకా కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి. నట్టల వ్యాధి వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. సొంత వైద్యం చేయకూడదు. పశువైద్యాధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. టీకాలు వేయించడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి.

– ఆర్.ఆనందరావు, ఏడీ, పశుసంవర్ధకశాఖ, ఆమదాలవలస

అక్కడ గోడలే పాఠాలు బోధిస్తాయి..



అంగన్‌వాడీ కేంద్రంలో వేలాడదీసిన అక్షరాలు

మండలంలోని చీడిపూడి-2 అంగన్‌డీ కేంద్రంలో గోడలే పాఠాలు చెబుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త గేదెల శాంతమ్మ కేంద్రాన్ని తెలుగు, ఇంగ్లిష్ అక్షరాలను అలంకరించారు. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన చార్టులు గోడలపై అతికించారు. ఆటవస్తువులతో చక్కగా అలంకరణ చేశారు. చిన్నారుల సమక్షంలో మట్టితో పాత్రలు తయారు చేయడం, కాగితాలతో చిన్న, చిన్న ఆటవస్తువులు తయారు చేయడం చేసి వారిలో సృజనాత్మకత పెంచుతున్నారు. వీటిని గుర్తించిన స్థానికులు పలువురు ఇటీవల ఆమెను సన్మానించారు.

– సారవకోట



మట్టితో తయారు చేసిన ఆట వస్తువులు, పాత్రలు



గోడకు అతికించిన చార్టులు, కాగితాలతో తయారు చేసిన ఆట వస్తువులు

వాటర్ వ్యాన్ బోల్తా

పాతపట్నం: పాతపట్నం-టెక్కలి రహదారిలోని హరిద్వారం వద్ద ఆదివారం వాటర్ బాటిళ్లతో వెళ్తున్న వ్యాన్ బోల్తాపడింది. హిరమండలం మండలం కల్లాటకు చెందిన డ్రైవర్ తెంబూరు నుంచి పాతపట్నం వస్తుండగా మధ్నాహ్నం 12 గంటల సమయంలో హరిద్వారం వద్ద వచ్చేసరికి అదుపు తప్పి రైల్వే సైడ్ ప్రొటెక్షన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.



బోల్తా పడిన వ్యాన్

శరవేగంగా అభివృద్ధి పనులు

పాతపట్నం: స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ అభివృద్ధి పనులు రైల్వే అధికారులు శరవేగంగా చేస్తున్నారు. ప్లాట్ ఫామ్‌కు షెల్స్ పనులు ఆదివారం నుంచి చేస్తున్నామని, మరో వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. గతంలో రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణీకులు రైలు ఎక్కలన్నా, దిగలన్నా ప్రమాదకరంగా ఉండేది. రైలు ఎక్కలంటే ప్లాట్ ఫామ్ రెండు అడుగు దిగువ ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడేవారు. ప్రతీరోజు పూరీ-గుణుపూర్, గుణుపూర్-పూరీ, విశాఖపట్నం-గుణుపూర్, గుణుపూర్-విశాఖపట్నం, కటక్-గుణుపూర్, గుణుపూర్-కటక్, గుణుపూర్-పలాస రైళ్ల కోసం పాతపట్నం రైల్వేస్టేషన్‌కు ప్రయాణీకులు వెళ్తూ, వస్తూంటారు. ప్రయాణీకులు రైల్వే స్టేషన్ వద్ద ఉండడానికి సదుపాయం లేక ఇబ్బంది పడేవారు. అభివృద్ధి పనుల్లో భాగంగా లైట్లు, కుర్చీలు, షెడ్డు నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీరు పనులు చేపడతామని అధికారులు తెలిపారు. రూ.1.20 కోట్లతో పాతపట్నం, టెక్కలి రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను చేపడుతున్నారు.



ప్లాట్ ఫామ్ పనులు చేపడుతున్న దృశ్యం

సాహిత్య రంగంలో వరల్డ్ రికార్డ్

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం డాక్టర్ కె.ఎ.రాములు సాహిత్య రంగంలో వరల్డ్ రికార్డ్ సాధించారు. తాడేపల్లి గూడెంలో 140వ ప్రపంచ తెలుగు సాహితీ జాతర జరిగింది. ఈ నెల 19 మధ్యాహ్నం నుంచి 20వ తేదీ మధ్యాహ్నం వరకు 24 గంటలు నిరంతరాయంగా గజల్స్, జానపద గీతాలు, డప్పు, ఫ్లూటు, మౌత్ ఆర్గాన్‌ను సుమారు 550 మంది కవులు, కళాకారులు, సాహితీవేత్తల మధ్య ప్రదర్శించారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టి.పార్థసారథి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమొంటూ, వరల్డ్ రికార్డ్ పత్రం అందుకున్నారు. ఈ ఘనత సాధించినందుకు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గతంలో అనంతపురం జిల్లాలో 33 గంటల 44 నిమిషాల 55 సెకండ్లు పాటు గజల్స్, జానపద గీతాలు తదితరవి ప్రదర్శించి భారత్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తానా బుక్ ఆఫ్ రికార్డ్, ఎన్టీఆర్ బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లు తన పేరున నమోదు చేసుకున్నారు.



ప్రశంసాపంత్రం, మెమొంటో అందుకుంటున్న హెచ్ఎం రాములు

నరసన్నపేట అభివృద్ధికి కృషి

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పల్లె పండగలో భాగంగా నరసన్నపేటలో రూ.1.22 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం బండి వీధి వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పట్టణంలోని సమస్యలను ప్రాధాన్యత కార్యక్రమంలో పరిష్కరిస్తానన్నారు.

తొలిత రోడ్లు, మురుగునీటి కాలువలను అభివృద్ధి చేస్తానన్నారు. రూ.1.22 కోట్లతో 16 పనులు మంజూరు చేశామన్నారు. మరిన్ని నిధులు తీసుకువచ్చి నరసన్నపేటను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కరగాం, కంబకాయల్లో కూడా వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. నరసన్నపేట ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, మాజీ సర్పంచ్‌లు గొద్దు చిట్టిబాబు, ఊణ్న రాజేశ్వరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సరుబుజ్జిలి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ఆధ్యాత్మిక చింతన కోసం కొంత సమయం కేటాయించాలని రొట్టవలస శ్రీరామానంద ఆశ్రమం వ్యవస్థాపకులు తొత్తడి వెంకట రమణస్వామి అన్నారు. ఆశ్రమం ఆవరణలో ఆదివారం సత్సంగం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు పాల్గొన్నారు.



సత్సంగంలో పాల్గొన్న భక్తులు

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



ప్రభుత్వ స్థలంలో నాటిన కొబ్బరి మొక్కలు

జలుమూరు: మండలంలోని రాణలో సర్వే నంబర్ 148-1లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గ్రామానికి చెందిన కూర్మాపు జగ్గారావు, శిమ్మ వాసుదేవరావు ఆక్రమించి కొబ్బరి మొక్కలు నాటారని తహసీల్దార్ రామారావుకు అదే గ్రామానికి చెందిన సోల రామారావు ఫిర్యాదు చేశారు. ఎంతో విలువైన భూమిని ఇలా ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి సొంతానికి వాడుకుంటున్నారని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆక్రమణపై సర్వే చేయించి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతే తొలగిస్తామన్నారు.

మజ్జి గౌరమ్మకు ప్రత్యేక పూజలు



మజ్జి గౌరమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక పాతబస్టాండ్‌లోని మజ్జి గౌరమ్మతల్లి మందిర ప్రథమ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలు సమర్పించారు. పరిసర వీధులకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా అవతార ప్రకటన దినోత్సవం



ఆమదాలవలస: సాయిబాబా దివ్య రథోత్సంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: సాయి బాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని పట్టణంలోని మెట్టక్కివలస, వేణమ్మపేట, లక్కుపురం, బూర్జ, కురింపేట, లక్ష్మీనగర్, తదితర గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు తెలిపారు. ప్రతీ మందిరంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. మధ్యాహ్నం ఆమదాలవలస గేట్ నుంచి పాలపోలమ్మ గుడి దరి లక్ష్మీనగర్ భజన మండలి వరకు బాబా దివ్య రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా జ్యోతి ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్. గురుప్రసాద్, జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధన్ సాయి, జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, డాక్టర్ పి.తాతయ్యలు, జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, సమితి కన్వీనర్లు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: మండల కేంద్రంలోని దేవరశెట్టి వీధిలో భగవాన్ సత్యసాయి సేవాసమితి మందిరంలో సత్య సాయిబాబా అవతరణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. హిరమండలం మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లో బాల వికాస్ విద్యార్థులతో మహానగర సంకీర్తనలు నిర్వహించారు. కోలాటం, నామసంకీర్తనలు అందరినీ ఆకుట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎల్.ఎన్.పేట, ఓంద్రజోల, గూనభద్ర, హిరమండలం, శ్యామలాపురం గ్రామాలకు చెందిన సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

సహస్ర పుష్పార్చన

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్ సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం పాదుక అష్టోత్తర శతనామావళి సహస్ర పుష్పార్చన ఆదివారం నిర్వహించారు. సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ అమ్మాయమ్మ, జోనల్ కన్వీనర్ మూర్తి, సమితి కన్వీనర్ ఎం.ఎల్.నాయుడు, ప్రతినిధులు ఆర్.అప్పలస్వామి, జామి రామకృష్ణ, ముద్దాడ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



పుష్పర్చనల్లో పాల్గొన్న మహిళలు

అంతిమ యాత్రకు అవస్థలు

కొత్తూరు: మండలంలోని పారాపురం పంచాయతీకి చెందిన దళితులు, కొత్తూరు పంచాయతీలోని కొంతమంది దళిత కుటుంబాలకు కొత్తూరులోనే శ్మశాన వాటిక ఉంది. ఆయా కుటుంబాలకు చెందిన వ్యక్తులు చనిపోతే అంతిమ సంస్కారాలకు అవస్థలు తప్పడం లేదు. ఆదివారం కొత్తూరు గ్రామానికి చెందిన వృద్ధుడు మృతి చెందారు. అంతిమ సంస్కారాల కోసం పంట పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్లారు. శ్మశాన వాటిక వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని రెవెన్యూ అధికారులను గ్రామస్తులు కోరారు.



పంట పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న దళితులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

పొందూరు: ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని కాపాడాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద అన్నారు. మండలంలోని గారపేట గ్రామంలోని ఆనందాశ్రమంలో ఏర్పాటు చేసిన సత్సంగం పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవ చింతనలో ఉండాలన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.